సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.34 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి. మార్కెట్‌కు 439 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.5.50
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.5.50, కనిష్టంగా రూ.2.50, సరాసరి రూ.4 మేర పలికింది.

గరిష్టం/కనిష్టం
43.1°/17.4°
జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదవగా.. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేసవితాపం కొనసాగుతోంది. తూర్పు దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.



న్యూస్‌రీల్

అప్పుల బాధతో వీఆర్‌ఓ ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

రొద్దం: అప్పులు, కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వీఆర్‌ఓ ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...మోపర్లపల్లికి చెందిన రమేష్ (35) కంబాలపల్లి సచివాయల వీఆర్‌ఓగా పనిచేస్తున్నారు. ఇటీవల అప్పులు ఎక్కువగా చేయడంతో దంపతుల మధ్య గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రపోయిన తర్వాత రమేష్ ఇంటి పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం గమనించిన కుటుంబీకులు స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ నాగస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ తదితరులు రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 20 వేల ఆర్థిక సాయం చేశారు.

పవర్‌లూమ్స్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడి

- నిబంధనలు ఉల్లంఘించిన చింతా ఆనంద్ పవర్‌లూమ్స్‌పై కేసు


పవర్‌లూమ్స్‌లో తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ధర్మవరం అర్బన్: చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అతిక్రమించి చీరలు తయారు చేస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం పట్టణంలోని పలు పవర్‌లూమ్స్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. పవర్‌లూమ్స్‌లో చేనేత ఉత్పత్తులను తయారు చేస్తున్న చింతా ఆనంద్ పవర్‌లూమ్స్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు, అసిస్టెంట్ డైరెక్టర్ అప్పాజి విలేకరులతో మాట్లాడారు. పవర్‌లూమ్స్‌లో 11 రకాల చేనేత ఉత్పత్తులను తయారు చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. అలా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పవర్‌లూమ్స్‌లో 45 శాతం రేషం ఉపయోగించవచ్చని, 45 శాతం రేషం దాటితే కేసులు తప్పవన్నారు. చేనేత రకాలను కాపాడేందుకు, పట్టు పరిశ్రమను రక్షించేందుకు ఇక నుంచీ పవర్‌లూమ్స్‌పై దాడులు ముమ్మరం చేస్తామన్నారు. దాడుల్లో అసిస్టెంట్ డైరెక్టర్ మహేశ్వర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నాగసాయి సుభాష్‌లు పాల్గొన్నారు.

టీడీపీలో పెత్తందారీ పోకడ

టీడీపీ బడుగుల బలహీనవర్గాల నాయకులకు గడ్డు కాలం వచ్చింది. వీరిపై అగ్రవర్ణాల వారి పెత్తనం ఎక్కువైంది. అడుగడుగునా వివక్ష, అవమానాలతో ఇబ్బంది పెడుతున్నారు. దీంతో పార్టీ కేడర్ రెండు వర్గాలుగా విడిపోతోంది. పెత్తనం తారస్థాయికి చేరుతుండటంతో బడుగులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇంత జరుగుతున్నా పార్టీ అధినాయకత్వం జోక్యం చేసుకోకపోవడం గమనార్హం.



- బడుగులకు అడుగడుగునా అవమానం
- శింగనమలలో బండారు శ్రావణిపై అగ్రకులాల పెత్తనం
- ఏకంగా శ్రావణి తండ్రిపైనే దాడి
- కళ్యాణదుర్గంలో దళితులపై దాడి జరిగినా లోకేష్ మాట్లాడలేదు
- మడకశిరలో ఈరన్న వర్గాన్ని కాదని గుండుమలకు పగ్గాలు
- మొన్నటికి మొన్న పార్టీలో బీసీలకు చోటు లేదని బొమ్మగౌని రాజీనామా
- కదిరి టీడీపీలో స్వపక్షంలో విపక్షంలా కందికుంటతో అత్తార్ రోజూ యుద్ధమే

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

తెలుగుదేశం పార్టీలో బడుగు, బలహీన వర్గాల నాయకులపై అణచివేత పెరిగిపోతోంది. 2019 ఎన్నికలకు ముందే ఆ పార్టీలో ఇమడలేక చాలామంది నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. కానీ ఇప్పుడు టీడీపీలో ఎస్సీల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్లోనూ చంద్రబాబు కోటరీగా చెప్పుకునే అగ్రకులాల వారే పెత్తనం చేస్తుండటంతో ఉన్న కొద్దిమంది ఎస్సీ, ఎస్టీలు, బీసీలూ ఇతర పార్టీల్లో చేరడానికి సిద్ధంగా ఉన్నారు. తాజాగా పదిహేను రోజులపాటు నారాలోకేష్ పాదయాత్ర చేసినా.. తన కళ్లముందే ఎస్సీలపై దాడులు జరుగుతున్నా.. నోరు మెదపలేదు.

పేరుకే బండారు శ్రావణి..
శింగనమల నియోజకవర్గంలో బండారు శ్రావణి ఎప్పట్నుంచో టీడీపీకి సేవలందిస్తోంది. కానీ ఈమెకు అడుగడుగునా పార్టీలో అవమానాలే ఎదురవుతున్నాయి. లోకేష్ పాదయాత్ర సమయంలోనే శ్రావణి తండ్రిపై ఇతర సామాజికవర్గ పెద్దలు దాడి చేశారు. గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. అయినా లోకేష్ దీనిపై స్పందించలేదు. అంతేకాదు నియోజకవర్గంలో పేరుకే శ్రావణి.. పెత్తనమంతా ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి చేతుల్లోనే ఉండటంతో ఎస్సీలు రగిలిపోతున్నారు.

మడకశిరలో ఈరన్నకు అవమానం
ఎన్నో ఏళ్లగా తెలుగుదేశం పార్టీని నమ్ముకుని ఉన్న మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్నకు రిక్త హస్తం ఎదురైంది. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన ఇక్కడ బీసీ సామాజిక వర్గానికి చెందిన గుండుమల తిప్పేస్వామిని సమన్వయకర్తగా నియమించడంపై ఎస్సీలు రగిలిపోతున్నారు. తిప్పేస్వామి పార్టీలు మారుతూ పదవులున్న చోటుకే వెళ్తుంటారని పేరు. ఇలాంటి వ్యక్తిని ఇక్కడ పెట్టి తమను ఏం చేయాలనుకుంటున్నారని ఈరన్న వర్గం కోపంతో ఉంది. ఇక్కపై తిప్పేస్వామి ఎవరికి చెబితే వారికి టికెట్ ఇచ్చే పరిస్థితి ఉందని, ఇదే జరిగితే ఈరన్న రెబల్‌గా మారే అవకాశం లేకపోలేదని సమాచారం.

దాడులు జరుగుతున్నా దిక్కేది?
ఇటీవల కళ్యాణదుర్గంలో ఎస్సీలపై దాడులు జరిగినపుడు.. సమీప నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్ర చేస్తున్నారు. టీడీపీ నేత ఉన్నం మారుతీచౌదరి వర్గం ఓ దళితుడిపై దాడి చేసింది. బండారుశ్రావణి తండ్రిపై దాడిచేసినా లోకేష్ మాట మాత్రంగానైనా పరామర్శించకపోవడంతో ఎస్సీ వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి.

బీసీలనూ తొక్కేస్తున్నారు..
టీడీపీలో ఎస్సీ, ఎస్టీలనే కాదు బీసీలనూ తొక్కేస్తున్నారని పలువురు నేతలు ఆరోపిస్తున్నారు. తాజాగా అనంతపురం జిల్లాలో ఈడిగ వర్గానికి చెందిన బొమ్మగౌని కిరణ్‌కుమార్‌గౌడ్ టీడీపీకి రాజీనామా చేశారు. ముప్పై ఏళ్లుగా టీడీపీ కోసం కృషి చేసినా కనీసం అనుబంధ సంఘాల్లో కూడా స్థానం ఇవ్వలేదని, ఈ పార్టీ బీసీలను అణగదొక్కుతోందని ఆరోపించి పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇంకా తన లాంటి ఎందరో బీసీ నేతలు పార్టీలో నలిగిపోతున్నారని, త్వరలోనే బయటకు వస్తారని చెప్పారు.

మైనార్టీల పరిస్థితీ అంతే..
ఉమ్మడి అనంతపురం జిల్లాలో మైనార్టీల పరిస్థితి కూడా తెలుగుదేశం పార్టీలో మరీ దారుణంగా ఉంది. 2014లో కదిరి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన అత్తార్ చాంద్‌బాషాను టీడీపీలోకి చేర్చుకుని అవసరానికి వాడుకుని ఇప్పుడు వదిలేశారు. అక్కడ కందికుంట ప్రసాద్ వైపే మొగ్గు చూపారు. కదిరిలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉంది. కానీ చాంద్‌బాషా స్వపక్షంలోనే విపక్షం లాగా కందికుంటతో రోజూ యుద్ధం చేయాల్సి వస్తోంది.

అసాంఘిక శక్తుల ఆట కట్టించండి

- సరిహద్దులో నిఘా మరింత పెంచాలి
- సిబ్బందికి ఎస్పీ మాధవరెడ్డి ఆదేశం


హిందూపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

హిందూపురం/అమరాపురం: ప్రజలకు ఇబ్బందులు కలిగించే అసాంఘిక శక్తుల ఆట కట్టించాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసులను ఆదేశించారు. మంగళవారం ఆయన హిందూపురం, అమరాపురంలలో పర్యటించారు. తొలుత హిందూపురం వెళ్లిన ఆయన వన్‌టౌన్, టూటౌన్, అప్‌గ్రేడ్, రూరల్ పోలీసుస్టేషన్లను తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లలో రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే పెండింగ్ కేసుల దర్యాప్తులో కలుగుతున్న అవరోధాల గురించి ఆరా తీశారు. రాష్ట్ర సరిహద్దు పరిసరాల్లో చెక్‌పోస్టులను బలోపేతం చేసి మద్యం, ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలన్నారు. అలాగే రాత్రి పూట బీట్స్ కచ్చితంగా సాగేలా ప్రణాళికలు సిద్ధంచేసుకోవాలన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఎప్పటికప్పుడు వివరాలు సిద్ధం చేసి వేలం వేయాలని సీఐలకు సూచించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుడి పట్ల మర్యాదగా నడుచుకోవాలని, చట్టపరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషిచేయాలన్నారు. విధి నిర్వహణ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు. అలాగే హిందూపురం రూరల్ పోలీసుస్టేషన్ వద్ద శిథిలమైన పోలీసుక్వార్టర్స్‌ను పరిశీలించి, నూతన భవన నిర్మాణాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఎస్పీ అమరాపురం, గుడిబండ, మడకశిర పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల వివరాలను ఆయా స్టేషన్ల ఎస్‌ఐలను అడిగి తెలుసుకున్నారు. మట్కా, గుట్కా, పేకాట, మద్యం అక్రమ రవాణా తదితర వాటిని పూర్తిగా అరికట్టాలన్నారు. నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ఉన్నందున గట్టి నిఘా ఉంచాలన్నారు.

పనుల్లో పురోగతి కనిపించాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు


ధర్మవరం మండలం పోతులనాగేపల్లి వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలని, దీనిపై ప్రతి అధికారీ శ్రద్ధ పెట్టి పని చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన తన చాంబర్‌లో భూముల రీ సర్వే, హౌసింగ్, ఇంటి పట్టాల పంపిణీ, జాతీయ రహదారుల భూ సేకరణ, 'స్పందన' అర్జీల పరిష్కారం, ఉపాధి హామీ పనులు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూముల రీసర్వే ప్రక్రియలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ 20వ తేదీ నాటికి పూర్తి కావాలన్నారు. భూ హక్కు పత్రాలు ఎప్పటికప్పుడు పంపిణీ చేయాలని, జాతీయ రహదారులకు సంబంధించిన భూ సేకరణ వేగవంతం చేయాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి
జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంజూరై ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభం కాని ఇళ్లు 10,190 ఉన్నాయని, వాటన్నింటినీ 28వ తేదీ నాటికి బేస్‌మెంట్‌స్థాయికి తీసుకురావాలన్నారు. ఈ మేరకు జియో ట్యాగింగ్ చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. జలజీవన్‌మిషన్ కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కూలీలకు అవగాహన కల్పించి అందరూ పనులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జిల్లాలోని 8 సచివాలయాలు, 31 ఆర్బీకేలు, 32 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాల పనులు వారం రోజుల్లో ప్రారంభించాలన్నారు. వైఎస్సార్ యంత్ర సేవ కింద జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. వివిధ శాఖల కింద పెండింగ్‌లో పనుల్లో పురోగతి చూపాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, సీపీఓ విజయ్‌కుమార్, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పట్టుపరిశ్రమ శాఖ జేడి పద్మమ్మ, డీపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి
ధర్మవరం అర్బన్: 'జగనన్న గోరుముద్ద' కింద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం ఆయన ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందిస్తున్నారా... లేదా అని పరిశీలించారు. వంటగదిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం లక్ష్మీచెన్నకేశవపురంలోని అంగన్‌వాడీ-1, 2 కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. చిన్నారులకు నాణ్యతగా భోజనం అందించాలని, మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కలెక్టర్ వెంట డీఈఓ మీనాక్షి, తహసీల్దార్ యోగేశ్వరిదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఏమ్మా...కూలి ఎంత పడుతోంది?
ధర్మవరం రూరల్: ''ఏమ్మా కూలి రోజూ ఎంత పడుతోంది..? బిల్లులు సకాలంలో వస్తున్నాయా..? పనిచేసే ప్రాంతంలో నీడ, నీరు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారా...'' అని కలెక్టర్ అరుణ్‌బాబు ఉపాధి హామీ కూలీలను ఆరా తీశారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని పోతులనాగేపల్లి వద్ద ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేపట్టిన నీటికుంట పూడిక తీత పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఉష్ణోగ్రతలు పెరిగిన దృష్ట్యా ఉదయం త్వరగా వచ్చి ఎండదెబ్బ తగలకుండా పనులు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న పనుల గురించి అధికారులతో ఆరా తీశారు. చేసిన పనులకు బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలని, కొలతలు కచ్చితంగా ఉండాలన్నారు.

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

- కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి
- విధుల్లో 1,447 మంది ఉపాధ్యాయులు


జవాబు పత్రాలను డీ కోడింగ్ చేస్తున్న సిబ్బంది

ప్రశాంతి నిలయం: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాట్లు చేశారు. మూల్యాంకన విధుల కోసం ఏసీఓలు, సీఈ, ఈఏలతో పాటు అదనపు సిబ్బందిని కలుపుకుని మొత్తం 1,447 మంది ఉపాధ్యాయులకు ఇప్పటికే ఆర్డర్ కాపీలు అందజేశారు. అందరూ తప్పకుండా మూల్యాంకన విధులకు హాజరు కావాల్సిందేనని డీఈఓ మీనాక్షి స్పష్టం చేశారు. మరీ ఇబ్బందికర పరిస్థితులున్న వారు 19వ తేదీ మధ్యాహ్నం 1 గంట లోపు తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలిస్తామన్నారు. బుధవారం నుంచి 26వ తేదీ వరకూ రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మూల్యాంకనం ఉంటుందని డీఈఓ తెలిపారు. ఒక్కో ఉపాధ్యాయునికి ఉదయం 20, మధ్యాహ్నం 20 పేపర్ల చొప్పున రోజుకు 40 పేపర్లు మాత్రమే ఇస్తామన్నారు. మూల్యాంకనం సజావుగా జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ మీనాక్షి ఏసీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. జిల్లా ఉప విద్యాధికారి రంగస్వామి, ఏడీఈ నాగరాజు ఆధ్వర్యంలో జవాబు పత్రాలను డీ కోడింగ్ చేశారు.

డిపాజిట్లు రూ.650 కోట్లకు చేరుకోవాలి

అనంతపురం సెంట్రల్: ఏడీసీసీ బ్యాంకులో డిపాజిట్ల మొత్తం 2024 మార్చి నాటికి రూ.650 కోట్లకు చేరుకోవాలని చైర్‌పర్సన్ లిఖిత పిలుపునిచ్చారు. మంగళవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లిఖిత మాట్లాడుతూ, ఇప్పటి వరకు డిపాజిట్ల రూపంలో రూ.522 కోట్లు ఉన్నాయని తెలిపారు. మెరుగైన సేవలతో వచ్చే మార్చికి నిర్దేశించిన మేరకు లక్ష్యం చేరుకోవాలని సూచించారు. ప్రస్తుతం బ్యాంకు లావాదేవీలు రూ.1721 కోట్ల మేర సాగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు శంకరరెడ్డి, రామాంజనేయులు, హైదర్‌వలి, కారుణ్య, జనార్దనరెడ్డి, ఈశ్వరరెడ్డి, బ్యాంకు సీఈఓ రాంప్రసాద్, జనరల్ మేనేజర్ సురేఖరాణి తదితరులు పాల్గొన్నారు.

శభాష్...బాగా పనిచేశారు

- కొడిగెనహళ్లి-2 సచివాలయ కన్వీనర్లకు సీఎం జగన్ అభినందన
- 'జగనన్నే మా భవిష్యత్'కు జోన్ స్థాయిలో కొడిగెనహళ్లికి మొదటి స్థానం


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో గంగాధర్‌రెడ్డి, షబ్బీర్, చిరంజీవి, పద్మక్క, చల్లా మధుసూదన్‌రెడ్డి

పరిగి: 'శభాష్...బాగా పనిచేశారు. ఇదే స్ఫూర్తితో మరింత కష్టపడి పనిచేయండి. ప్రజలకు మెరుగైన సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి' అని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కొడిగెనహళ్లి-2 సచివాలయ కన్వీనర్లను అభినందించారు. నాలుగేళ్లలో జరిగిన సంక్షేమాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7వ తేదీన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం ప్రారంభించారు. దీంతో సచివాలయాల పరిగి మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి నేతృత్వంలో కొడిగెనహళ్లి సచివాలయ-2 పరిధిలోని కన్వీనర్లు షబ్బీర్, చిరంజీవి, పద్మక్క గృహసారథులతో కలిసి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు అందుకున్న వారితో మాట్లాడారు. వారికి కలిగిన లబ్ధి, పథకాల అమలు తెలుసుకున్నారు. వారి అనుమతి మేరకు ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అతికించారు. ఎండలు భగభగమండుతున్నా లెక్కచేయకుండా తమ పరిధిలో కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేశారు. దీంతో కొడిగెనహళ్లి-2 సచివాలయం జోన్-5లో మొదటి స్థానంలో నిలిచింది. మంగళవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలోని 5 జోన్ల పరిధిలో తొలిస్థానంలో నిలిచిన సచివాలయ మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కొడిగెనహళ్లి సచివాలయ కన్వీనర్లు షబ్బీర్, చిరంజీవి, పద్మక్కతో పాటూ మండల సచివాలయ కన్వీనర్ గంగాధర్‌రెడ్డిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం నిర్వహించిన తీరుతెన్నులపై ఆరా తీశారు. అనంతరం పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణతో పాటు జోనల్ కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డిని, జిల్లా కోఆర్డినేటర్ మహేష్ శ్రీనును సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

నిప్పుల కుంపటి



- గుంతకల్లులో 43.8 డిగ్రీలు, తాడిమర్రిలో 43.1 డిగ్రీలు
- ఉమ్మడి జిల్లాలో మండే ఎండలతో వేసవితాపం తీవ్రం
- అల్లాడిపోతున్న జనం

అనంతపురం అగ్రికల్చర్: వేసవి తాపం తారస్థాయికి చేరుకుంది. ఉమ్మడి జిల్లాలో పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటింది. గత రెండు రోజులుగా వేకువజామున ఉష్ణోగ్రతలు పడిపోతుండటం విశేషం. తెల్లవారుజామున రెండు మూడు గంటల పాటు చల్లటి వాతావరణం ఏర్పడుతుండటంతో కాస్తంత ఉపశమనం కలుగుతోంది. ఉదయం 9 గంటలకల్లా సూరీడు ప్రతాపం చూపిస్తున్నాడు. సాయంత్రం 6 గంటల వరకు ఉక్కపోత తగ్గడం లేదు. అర్ధరాత్రి వరకు వేడిగాలులు జనానికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. మంగళవారం అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలో 43.8 డిగ్రీలు, శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలంలో 43.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. తాడిపత్రి 43.7, పామిడి, పెద్దవడుగూరు 42.7, శింగనమల 42.6, యల్లనూరు, కళ్యాణదుర్గం 42.5, కణేకల్లు 42.4, బొమ్మనహాళ్ 42.3, రాయదుర్గం 42.2 డిగ్రీలు నమోదయ్యాయి. అలాగే తనకల్లు 42.6, చెన్నేకొత్తపల్లి 42.4, పుట్టపర్తి 42.3 డిగ్రీలు నమోదయ్యాయి. నాలుగైదు మండలాలు మినహా మిగతా మండలాల్లో పగటి ఉష్ణోగ్రత 41 డిగ్రీలు దాటింది. అనూహ్యంగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుదల నమోదు కావడం విశేషం. గత రెండు రోజులుగా 17 నుంచి 22 డిగ్రీల మధ్య రికార్డవుతోంది. అంతకు మునుపు రాత్రి ఉష్ణోగ్రతలు 20 నుంచి 27 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. సూర్యప్రతాపం పెరగడంతో జనం ఇబ్బంది పడుతున్నారు.

క్లుప్తంగా

ప్రజల ఆరోగ్యాలకు హాని కలిగిస్తే చర్యలు



కబాబ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్

గోరంట్ల: ప్రజల ఆరోగ్యాలకు హాని కల్గిస్తే చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్ హెచ్చరించారు. స్థానిక బస్టాండ్ సర్కిల్ సంత రోడ్డులో నిర్వహిస్తున్న రెండు కబాబ్ సెంటర్లను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్లలో వినియోగిస్తున్న నూనెను పరిశీలించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా కబాబ్ విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. కబాబ్ తయారీకి వినియోగించిన నూనె శాంపుల్స్ సేకరించామని, పరిశీలన కోసం ల్యాబ్‌కు పంపుతున్నట్లు ఆమె తెలిపారు.

మేలో సీపీఐ శిక్షణ తరగతులు



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

హిందూపురం టౌన్: లేపాక్షిలో మే 13, 14, 15న సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలిపారు. మంగళవారం పట్టణంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్ కుమార్, తాలూకా సహాయ కార్యదర్శి శివప్ప, పట్టణ సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



రోదిస్తున్న మృతుడి భార్య

సోమందేపల్లి: స్థానిక వినాయకనగర్‌కు చెందిన గోపాల్ (27) ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపిన మేరకు.. మృతుడు హమాలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం మాధవితో వివాహం కాగా, సంతానం కల్గలేదు. ఈ క్రమంలోనే కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటిలో పై కప్పునకు చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఔషధ గుణాలు మెండు..

- ప్రకృతి సిద్ధమైన ఈత చెట్టు నీరాకు భలే డిమాండ్
- ఎన్నో ఔషధ గుణాలున్న హెల్త్ డ్రింక్‌గా గుర్తింపు
- షుగర్ వ్యాధిగ్రస్తులకు సైతం మేలంటున్న వైద్య నిపుణులు

రోగ నిరోధక శక్తి పెంచు

కదిరి: ఈత చెట్ల నుంచి సహజ సిద్ధంగా లభించే నీరా, దాని ఉత్పత్తులకు భారీ డిమాండ్ నెలకొంది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీ కేఫ్‌ల్లా పలు చోట్ల నీరా కేఫ్‌లు వెలిశాయి. ఇది ఎన్నో వ్యాధులను నివారించే ఆరోగ్య ద్రావకమని ప్రకృతి వైద్య నిపుణులు చెబుతున్నారు. గ్రామాల్లోనే కాకుండా పట్టణాలు, నగరాల్లో కూడా తట్టు, ఆటలమ్మ, కామెర్లు వంటి వ్యాధులకు గురైన వారికి నీరా తాగించాలని పెద్దలు సూచిస్తుంటారు. అజీర్తి, గ్యాస్, మలబద్దకం లాంటి సమస్యలు దూరమవుతాయని పేర్కొంటున్నారు.

విస్తారంగా ఈత చెట్లు

శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరి, గోరంట్ల, హిందూపురం, చిలమత్తూరు, పెనుకొండ, బత్తలపల్లి, మడకశిర, అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో తాటి చెట్లతో పాటు ఈత చెట్లూ విస్తారంగా ఉన్నాయి. ప్రభుత్వ బంజరు భూములతో పాటు కొందరు రైతులు సైతం ఈత చెట్లను పెంచుతున్నారు. తాటి చెట్ల నుంచి కూడా నీరా లభిస్తుంది కానీ, ఈత నీరాలోనే అత్యధిక ఔషధ గుణాలు ఉన్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

ఎన్నో రకాల మినరల్స్

ప్రతి 100 మిల్లీలీటర్ల నీరాలో 264 కేసీఎల్ ప్రొటీన్, పిండిపదార్థాలు, సున్నా శాతం కొవ్వు, లవణాలు, ఐరన్, మెగ్నీషియం, జింక్, కాల్షియం, సోడియం, పొటాషియం ఉన్నాయి. ఎస్కార్బిస్ ఆసిడ్, నికోటిన్, రీబోఫ్లోవిన్ లాంటి విటమిన్స్, ఆరోగ్యానికి మేలు చేసే మాంసకృత్తులు ఇతర పోషకాలు ఎన్నో నీరాలో ఉన్నాయి. దీనిని తాగడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వైద్య నిపుణులు అంటున్నారు. ఇది ప్రకృతి సిద్ధమైన సహజ పానీయం కాబట్టి ఎవరైనా తాగవచ్చునంటున్నారు. ఇందులో సుక్రోజ్ ఉండడం వల్ల డయాబెటీస్ ఉన్నవారు, చిన్నపిల్లలు, గర్భిణులు కూడా సేవించవచ్చునని సూచిస్తున్నారు.



ఈత చెట్టుకు కుండ ఏర్పాటు చేస్తున్న గీత కార్మికుడు

ఔషధ గుణాలు మెండు..

- మలబద్దకం, గ్యాస్ దూరం అవుతాయి.
- సుక్రోస్, ప్రొటీన్స్ సహజసిద్ధమైన తీపితోపాటు శక్తిని ఇస్తాయి.
- కంటి చూపు కూడా మెరుగుపడుతుంది.



ఈత నీరాను బాటిల్‌లో నింపుతున్న గీత కార్మికుడు చంద్రశేఖర్

- లివర్ సంబంధిత వ్యాధులకు నివారిణిగా పనిచేస్తుంది.
- కామెర్లు, ఫ్యాటీ లివర్, లివరోసిస్ నుంచి నీరా కాపాడుతుంది. గుండె పనిచేసే విధానాన్ని మెరుగు పరుస్తుంది.
- కిడ్నీలో రాళ్లను నివారిస్తుంది. వచ్చిన రాళ్లను కరిగిస్తుంది.
- క్యాన్సర్ వచ్చే అవకాశాన్ని తగ్గిస్తుంది.
- దీనిలో ఉండే మినరల్స్ రక్తకణాలను వృద్ధి చేస్తాయి.
- ముఖ్యంగా నీరా తాగితే ఫ్లోరోసిస్ తీవ్రత తగ్గుతుంది.
- ఆయుర్వేదంలో వాడుతారు.
- ఆల్కాహాల్ శాతం తక్కువగా ఉంటుంది.

14 రకాల రోగాలు నయం



ఈత, తాటి చెట్ల నుంచి లభించే నీరాలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. 14 రకాల రోగాలు నయమవుతాయని పలు పరిశోధనల ద్వారా వెల్లడైంది. ఇది చాలా ఆరోగ్యకరమైన డ్రింక్. షుగర్ వ్యాధిగ్రస్తులు కూడా తీసుకోవచ్చు. ఎలాంటి ఆల్కహాల్ ఉండదని శాస్త్రవేత్తలు కూడా ధ్రువీకరించారు.

– డా.మదన్‌కుమార్, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్, కదిరి

బెల్లం, తేనె ఉత్పత్తి



మార్కెట్‌లో లభించే శీతల పానీయాల కన్నా ఈత చెట్ల నుంచి సహజసిద్ధంగా లభించే నీరా పానీయం ఎంతో మంచిది. సిరిధాన్యాలను ప్రోత్సహిస్తున్న స్వతంత్ర ఆహార, ఆరోగ్య శాస్త్రవేత్త డా.ఖాదర్‌వలీ స్ఫూర్తితో మేము ఈత నీరాతో ఎలాంటి రసాయనాలు, ప్రిజర్వేటివ్స్ వాడకుండా బెల్లం, తేనె ఉత్పత్తి చేస్తున్నాం. ఈ ఉత్పత్తులను అనంతపురంలో విక్రయిస్తున్నాం. 500 మందికి పైగా గీత కార్మికులతో 'సెర నీరా టాపర్స్ కో ఆపరేటివ్ సొసైటీ'ని నెలకొల్పాం.

– ఎస్.కుళ్లాయిస్వామి, సొసైటీ ఫర్ ఎన్విరాన్మెంట్ అండ్ రూరల్ యాక్షన్ (సెరా) వ్యవస్థాపకుడు, అనంతపురం

40 ఏళ్లుగా ఇదే వృత్తి



మా పూర్వీకుల నుంచి ఈత చెట్ల ద్వారా నీరా తీయడాన్ని కుల వృత్తిగా చేస్తూ వస్తున్నాం. గతంలో కంటే ఇప్పుడు నీరాకు డిమాండ్ పెరిగింది. లాభాపేక్ష లేకుండా 2 లీటర్ల నీరాను రూ.100కే అమ్ముతున్నాం. సూర్యాస్తమయం సమయంలో ఈత చెట్లకు కుండలు కట్టి, మరుసటి రోజు ఉదయాన్నే తీసుకొస్తాం.

– విశ్వనాథ్, గీత కార్మికుడు బండమీద కొత్తపల్లి, తలుపుల మండలం

సరుకులు దారి మళ్లించిన వారిపై చర్యలు

తనకల్లు: మండల పరిధిలోని సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాల నుంచి సరుకులను దారి మళ్లించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్‌టీడబ్ల్యూ ఈఓ మోహన్‌రామ్ తెలిపారు. పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వంట మనుషుల అక్రమాలపై విచారణ చేశారు. ప్రభుత్వం విద్యార్థినులకు అందజేసే నిత్యావసర సరుకులను దొంగచాటున తీసుకెళ్లి బయట విక్రయిస్తున్నట్లు తల్లిదండ్రులు చేసిన ఆరోపణలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడారు. తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వంట మనుషులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని, తరచూ తమపై దురుసుగా వ్యవహరిస్తున్నారంటూ బాలికలు విచారణాధికారికి తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమంగా సరుకులను దారి మళ్లించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కదిరి రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ మురళీ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర నాయుడు పాల్గొన్నారు.



పాఠశాలలో విచారణ చేస్తున్న డీఎస్‌టీడబ్ల్యూఈఓ మోహన్‌రామ్

గోపేపల్లి తండాలో పోలీసు పికెటింగ్

నల్లమాడ: మండలంలోని గోపేపల్లి తండాలో మంగళవారం పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలం విషయంలో సోమవారం రాత్రి తండాకు చెందిన ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుని పలువురు గాయపడిన విషయం తెలిసిందే. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం రాత్రి నల్లమాడ, కదిరి రూరల్, కొత్తచెరువు సీఐలు నిరంజన్‌రెడ్డి, శంకర్‌నాయక్, జయానాయక్, నల్లమాడ, ఓడీ చెరువు, అమడగూరు, బుక్కపట్నం ఎస్‌ఐలు వలీబాషా, గోపీ, వెంకటనారాయణ, నరసింహుడు స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి తండాకు చేరుకొని ఘర్షణ తీవ్రతరం కాకుండా చర్యలు చేపట్టారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్‌ఐ వలీబాషా తెలిపారు. తహసీల్దార్ దేవేంద్రనాయక్ ఆదేశాలతో మండల సర్వేయర్ అంజనాదేవి, వీఆర్‌ఓ మాలిక్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ మంగళవారం తండాలో ఆర్‌డీటీ పాఠశాల వద్ద సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించారు. గిరిజన కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించినట్లు తహసీల్దార్ తెలిపారు.



గోపేపల్లి తండాలోని ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పోలీస్ స్టేషన్ తనిఖీ..

నల్లమాడ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ తనిఖీ చేశారు. గోపేపల్లి తండాలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ వలీబాషా పాల్గొన్నారు.

పెళ్లైన మూణ్నెల్లకే.. పరలోకాలకు

పావగడ: పెళ్లైన మూణ్నెల్లకే రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడిన ఘటన వైఎస్ హొసకోట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని పోతగానహళ్లికి చెందిన మురళి (22)కి 3 నెలల క్రితమే వివాహం జరిగింది. మంగళవారం ద్విచక్రవాహనంలో దొడ్డహళ్లి నుంచి పోతగానహళ్లి వెళ్తుండగా ఓ టాటా ఏస్ వాహనం ఢీకొంది. తీవ్రగాయాలపాలైన మురళి ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. టాటా ఏస్ వాహనం పల్టీలు కొట్టగా అందులో ఉన్న కూరగాయల వ్యాపారులు మల్లికమ్మ, గంగమ్మ, ధనమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని తుమకూరు ఆస్పత్రికి తరలించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు హెచ్‌వీ వెంకటేశ్ క్షతగాత్రులకు ఆర్థిక సాయం అందించారు. మురళి మృతితో తల్లితండ్రులు ఈరణ్ణ, నాగమ్మ, భార్య పద్మావతి గుండెలవిసేలా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పెనుకొండను వారసత్వ నగరంగా ప్రకటించాలి

పెనుకొండ: రాచరిక వైభవానికి, విశిష్ట ఆలయాలకు నెలవైన పెనుకొండను భారత వారసత్వ నగరంగా ప్రకటించాలని చరిత్రకారుడు మైలవరపు నారాయణ స్వామి (మైనాస్వామి) పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పెనుకొండ కోట, ఇతర కట్టడాలను ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2 వేల సంవత్సరాల చరిత్ర కలిగిన నగరం పర్యాటక, సాంస్కృతికంగా అభివృద్ధిలో వెనుకబడడం శోచనీయమన్నారు. పెనుకొండను అభివృద్ధికి కనీసం రూ.300 కోట్లు కేటాయించాలని కోరారు. ప్రాచీన, పటిష్టమైన పొడవాటి కోటలు రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో ఉంటే, అందులో పెనుకొండ ఒకటని పేర్కొన్నారు. అద్భుత కళా సంపత్తి, జైన దేవాలయాలు, సుదర పుష్కరిణులు, జైన తీర్థంకరులు రామభద్ర, కాశీ విశ్వేశ్వర, ఐముక్తేశ్వర దేవాలయాలు ఉన్న పవిత్ర ప్రాంతమన్నారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి మంత్రి కిషన్‌రెడ్డికి పెనుకొండ వైభవాన్ని వివరించి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పట్టణ ప్రముఖులు రామకృష్ణప్ప, సుధాకర్ గుప్తా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో కట్టడాలను పరిశీలిస్తున్న మైనాస్వామి

ఘనంగా ప్రాకారోత్సవం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి వెండిరథ ప్రాకారోత్సవం ఘనంగా నిర్వహించారు. రంగమండపంలో శ్రీదేవి భూదేవి సమేత వసంత వల్లభుడిని సుగంధ పుష్పాలతో అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను వెండి రథంపై కొలువు తీర్చి ప్రాకారోత్సవం కనులపండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎఫ్‌ఓ తిమ్మమ్మ మర్రిమాను సందర్శన



తిమ్మమ్మ మర్రిమాను విశిష్టతను తెలుసుకుంటున్న డీఎఫ్‌ఓ

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని గూటిబైలు గ్రామంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిమ్మమ్మ మర్రిమానును డీఎఫ్‌ఓ రవీంద్రనాథ్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి దుశ్శాలువతో సత్కరించారు. తిమ్మమాంబ ఆలయంలో తిమ్మమాంబ, బాలవీరయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర, మర్రిమాను విశిష్టతను టూరిజం గైడ్ మనోహర్, అనిల్‌రాయల్ ద్వారా డీఎఫ్‌ఓ తెలుసుకున్నారు. ఆలయంలోని తిమ్మమ్మ ఘాట్ వద్ద భక్తుల సౌకర్యార్థం పైకప్పు నిర్మించడానికి సహకరించాలని కమిటీ సభ్యులు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కదిరి రేంజర్ శ్రీనివాసులు, సెక్షన్ అధికారి షామీర్‌బాషా, కమిటీ సభ్యులు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్ వరం'

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమం గ్రామీణ ప్రజలకు వరం లాంటిదని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి మండలం కప్పలబండలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచితంగా అత్యుత్తమ వైద్యం అందిస్తున్నారన్నారు. పరీక్షలను సైతం చేస్తున్నారన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, సీజనల్ వ్యాధులు, వడదెబ్బపై అవగాహన పెంచుకొని జాగ్రత్తగా ఉండాలన్నారు. 104 ద్వారా అందించే సేవలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నాగరాజునాయక్, సీహెచ్‌ఓ నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, సిబ్బంది అపర్ణ, శివ, జ్యోతి, లక్ష్మీపతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

28న ఖాదర్‌వలి సదస్సు

అనంతపురం అగ్రికల్చర్: చిరుధాన్యాల సాగు, సిరిధాన్యాల ఆహారోత్పత్తులు, వినియోగ అవసరాలపై ప్రజలను చైతన్య పరిచేందుకు ఈ నెల 28న సాయంత్రం 4 గంటలకు అనంతపురం నగర శివారులోని కురుగుంటలో మైసూరుకు చెందిన ప్రఖ్యాత ఆహార శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదరణ రామకృష్ణ, విశ్రాంత ప్రొఫెసర్ గంగిరెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కురుగుంటలోని పుడమిసిరి మిల్లెట్ హోటల్‌లో రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో వినియోగదారుల సందేహాలను ఆయన నివృత్తి చేయనున్నారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు రామ్‌నగర్‌లోని కమ్మభవన్‌లో అవగాహన కార్యక్రమం ఉంటుంది. ఇటీవల పద్మశ్రీ పురస్కారం అందుకున్న తర్వాత తొలిసారిగా జిల్లాకు విచ్చేయనున్న ఖాదర్‌వలిని ఈ సందర్భంగా నిర్వాహకులు సన్మానించనున్నారు. అంతకు ముందు ఉదయం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల సమీపంలోని బెస్ట్ యూనివర్సిటీలో జరిగే రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సులో ఆయన పాల్గొననున్నారు.

కొలుతలు సక్రమంగా ఉన్నాయా.. లేదా?



భవనాలు పరిశీలిస్తున్న డీఐజీ మాధవి

ప్రశాంతి నిలయం: రిజిస్ట్రేషన్ జరిగిన కట్టడాల కొలతలు పత్రాలలో పొందుపర్చిన మేరకు సక్రమంగా ఉన్నాయా లేదా అన్న కోణంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ అనంతపురం డీఐజీ మాధవి తనిఖీ చేశారు. ప్రశాంతి గ్రామ వద్ద ఉన్న జిల్లా రిజిస్ట్రార్, బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం ఆమె రికార్డులను పరిశీలించారు. బుకపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏడాదిలో జరిగిన భవన నిర్మాణాల రిజిస్ట్రేషన్ల పత్రాలను పరిశీలించిన అనంతరం భవనాల వద్దకు వెళ్లి కొలతలు తీశారు. జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మా.. కాపాడమ్మా



శ్రీకంఠపురంలో ఓ ఇంటి వద్ద విందు భోజనాలు



జ్యోతులతో తరలివస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో పెద్ద ముత్యాలమ్మ దేవి

హిందూపురం: పట్టణంలోని శ్రీకంఠపురంలో ముత్యాలమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం దాకా అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. ఆలయ నిర్వాహకులు, భక్తులు పురం పొలిమేర నుంచి పెద్ద ముత్యాలమ్మ, చిన్న ముత్యాలప్ప ఉత్సవమూర్తుల పల్లకీతో ఆలయం వరకూ తీసుకొచ్చి కొలువుదీర్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు పూల జ్యోతులు, ప్రసాదాలతో ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి సమర్పించారు. గొర్రెలు, మేకలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతరను పురస్కరించుకుని శ్రీకంఠపురం సందడిగా మారింది. ఏ ఇంటి ముందు చూసినా షామియానాలు, బంధుమిత్రులతో కళకళలాడాయి. జనం రాకపోకలతో రోడ్లు కిక్కిరిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా టూటౌన్, రూరల్ సీఐలు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. కాగా, జాతర సందర్భంగా ఈ ప్రాంతాల్లో సుమారు 1,500 కుటుంబాలు విందు, వినోదాల కోసం రూ.2 కోట్లు పైగా వ్యయం చేసి ఉంటారని అంచనా.